సాక్షి
సూర్యాపేట
సోమవారం ౹ 10 ౹ ఫిబ్రవరి ౹ 2025



25లక్షల నగదు అపహరణ
ప్రైవేట్ ట్రావెల్ బస్సులో రూ.25లక్షల నగదు ఉన్న ప్రయాణికుడి బ్యాగును గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించాడు. - 8లో



చిన్న కారణంతోనే..
మద్యం మత్తులో తండ్రి విచక్షణారహితంగా కొట్టడంతో కుమారుడు మృతిచెందాడు. చౌటుప్పల్‌లో ఘటన చోటు చేసుకుంది. - 8లో



తల్లిదండ్రుల ఆందోళన
జనంపల్లి గురుకులంలో ప్రిన్సిపాల్ వైఖరిని నిరసిస్తూ ఆదివారం విద్యార్థుల తల్లితండ్రులు ఆందోళనకు దిగారు. - 8లో

పెద్దగట్టుపై పట్టింపేది?

- మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్న లింగమంతుల స్వామి జాతర
- భక్తుల సౌకర్యాల కల్పనకు రూ.5కోట్లు మంజూరు
- శాశ్వత పనులు కాకుండా తాత్కాలిక పనులు చేసి చేతులు దులుపుకుంటున్న అధికారులు
- చేపట్టిన పనులు కూడా నత్తనడకన..



ఆలయం వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

చివ్వెంల(సూర్యాపేట): దురాజ్‌పల్లిలోని పెద్దగట్టు (శ్రీ లింగమంతుల స్వామి) జాతర ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు జరగనుంది. ఐదు రోజుల పాటు జరుగనున్న ఉత్సవాలకు తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, రాజస్థాన్ నుంచి భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు వస్తారు. సుమారు 30 లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. అయితే ఈ జాతరకు ఇంకా కొద్ది రోజులే మిగిలి ఉంది. పనులు మాత్రం నత్తనడకన సాగుతుండడంతో జాతర నాటికి పనులు పూర్తవుతాయో లేదోనని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి జాతరలో తాత్కాలిక పనులే..
పెద్దగట్టు జాతరకు ప్రతిసారి తాత్కాలిక పనులు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఈసారైనా తాత్కాలిక పనులు కాకుండా శాశ్వతంగా చేపట్టాలని కోరుతున్నారు. భక్తుల సౌకర్యార్థం జాతరకు వచ్చే రహదారుల విస్తరణ, వాహనాల పార్కింగ్ స్థలాల ఏర్పాటు, తాగునీటి వసతులు, వైద్య సదుపాయాలు, రహదారుల మరమ్మతులు, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని భక్తులు వేడుకుంటున్నారు. జాతర జరిగే సమయంలో మాత్రమే అధికారులు హడావుడి చేసి, తర్వాత ఆలయం వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని భక్తులు వాపోతున్నారు.

నిరుపయోగంగా నీటి కుళాయిలు, మరుగుదొడ్లు
పెద్దగట్టు వద్ద ఇప్పటివరకు మిషన్ భగీరథ ట్యాంకులకు నీటి కుళాయిలు ఏర్పాటు చేయలేదు. గతంలో తాత్కాలిక ప్రాతిపాదికన ఏర్పాటు చేసిన మొబైల్ టాయిలెట్లు.. నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. గుట్టపై తాగునీటి ట్యాంకు ఉన్నప్పటికీ అక్కడక్కడా ఏర్పాటు చేసిన కుళాయిలకు పూర్తిస్థాయిలో నీరు అందించలేని పరిస్థితి. మహిళలు స్నానాలు చేసి దుస్తులు మార్చుకునేందుకు సరైన గదులు లేవు.

రూ.5 కోట్ల నిధులు మంజూరు..
ప్రభుత్వం జాతరకు రూ. 5 కోట్ల నిధులు మంజూరు చేసింది. జాతరకు వారం రోజులు మాత్రమే ఉండటంతో, గతంలో మాదిరిగా మళ్లీ తాత్కాలిక పనులే చేపడుతారా అని భక్తులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి జాతరకు కోట్లాది నిధులు మంజూరవుతున్నా పనులు మాత్రం అంతంత మాత్రంగానే చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి భక్తులకు మెరుగైన సేవలు అందించాలని కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న మొబైల్ టాయిలెట్లు

జాతరలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం
ఈ నెల 16 నుంచి 20 వరకు జాతర జరగనున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూస్తాం. జాతరకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. చలువ పెందిళ్లు వేస్తున్నాం. తాగునీటి సదుపాయం కల్పిస్తున్నాం.
– పోలేబోయిన నర్సయ్య యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్



కోనేరు శుభ్రం చేస్తున్న సిబ్బంది



చెరువు చుట్టూ ఏర్పాటు చేయకుండా పడేసిన బారికేడ్లు

ప్రాదేశిక సమరానికి సమాయత్తం

- రేపు మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించనున్న పోలింగ్ కేంద్రాల జాబితా
- 15న విడుదల కానున్న తుది జాబితా
- పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సౌకర్యాల కల్పనపై దృష్టి సారించిన అధికారులు



తిరుమలగిరి (తుంగతుర్తి): మండల, జిల్లా ప్రాదేశిక ఎన్నికల నిర్వహణకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఓ వైపు సర్పంచ్ ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో తాజాగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికలకు సంబంధించి అధికార యంత్రాంగం కసరత్తు మొదలు పెట్టింది. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల అధికారులు, సిబ్బంది ని యామకం, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించడంతో పాటు ఈ నెల 15న పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రకటించేందుకు సిద్ధమవుతున్నారు.

700 మందికి ఒక పోలింగ్ కేంద్రం
జిల్లాలో పాత స్థానాలకే ఎన్నికలు నిర్వహించనున్నారు. 2019 నుంచి ఇప్పటివరకు స్థానాలు పెరగలేదు. కొన్ని మున్సిపాలిటీల్లో గ్రామాలు విలీనమయ్యాయి. కానీ ఎంపీటీసీ స్థానాలు పెరగలేదు. ఈ సారి 23 మండలాల్లో 23 జెడ్పీటీసీ, 235 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రతి 700 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు.

రిజర్వేషన్లపై ఉత్కంఠ
త్వరలో జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో రిజర్వేషన్లపై ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టి గ్రామాల్లో అభ్యర్థులకు 42 శాతం సీట్లు ఇస్తామని ప్రకటించడంతో ఆశావహులు ఎదురు చూస్తున్నారు. దీనికి తోడు స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం సీట్లు మహిళలకు కేటాయించడంతో పురుషులకు రిజర్వేషన్లు రాకుంటే తమ కుటుంబ సభ్యుల్లోని మహిళలను నిలబెట్టడానికి అన్ని పార్టీల్లోని నాయకులు సిద్ధంగా ఉన్నారు.

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 11న పోలింగ్ కేంద్రాల జాబితాను మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించనున్నారు. 11 నుంచి 13వ తేదీ వరకు పోలింగ్ కేంద్రాలకు అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించనున్నారు. 13న వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి సూచనలు తీసుకోనున్నారు. 14న అభ్యంతరాలు స్వీకరించి కలెక్టర్ అనుమతికి పంపిస్తారు. కలెక్టర్ ఆమోదంతో 15న తుది జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శించనున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికలతో పాటు సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు వస్తుండడంతో గ్రామాల్లో ఎన్నికల వేడి రాజుకుంటుంది. వివిధ పార్టీల నుంచి పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు ఇప్పటి నుంచే ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

వీరికి బాధ్యతలు..
జిల్లాలోని స్థానిక సంస్థల ఎన్నికలకుగాను ప్రత్యేకాధికారులను నియమించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి (ఏఆర్ఓ)తో పాటు ఎంపీడీఓలు కీలక పాత్ర పోషిస్తారు. 23 మండలాలకు 23 మంది ఆర్ఓలు, 4 ఎంపీటీసీ స్థానాలకు ఒకరు చొప్పున ఏఆర్ఓలను నియమించనున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రిజర్వేషన్ల అమలు, పోలింగ్ కేంద్రాల కేటాయింపు, ఎన్నికల సిబ్బంది నియామకం, శిక్షణపై దృష్టి సారించారు. అదే విధంగా ఎన్నికలకు అవసరమైన ప్రిసైడింగ్ అధికారి (పీఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి (ఓపీఓ), రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమిస్తారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో మాస్టర్ ట్రైనర్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరంతా జిల్లా, మండలాల్లో ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగు నీరు, ప్రహరీ, లైటింగ్, ల్యాంప్‌లు తదితర మౌలిక వసతులను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఎక్కడ ఏ అవసరం ఉందో గుర్తించి వాటిని యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

న్యూస్‌రీల్

యాదవులకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలి



యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు సైదులును సన్మానిస్తున్న నాయకులు

కోదాడ: యాదవ సామాజిక వర్గానికి రాజకీయంగా తగిన ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు మర్యాద సైదులుయాదవ్ కోరారు. ఆదివారం కోదాడలో నిర్వహించిన సంఘం నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16 నుంచి 18 వరకు దురాజ్‌పల్లి, కోదాడలో జరిగే లింగమంతుల జాతరలో యాదవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఆయనను స్థానిక నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తూము వెంకన్న యాదవ్, కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు ఈదుల కృష్ణయ్యయాదవ్, కట్టెబోయిన శ్రీనివాస్, గుండెల సూర్యనారాయణ, పిన్నబోయిన శ్రీనివాస్, మాదాల ఉపేందర్, మొడెం సైదిబాబు, చిమట శ్రీనివాస్, రాముడు, శివకృష్ణ, గంధం ఉపేందర్, జంగాల కృష్ణయ్య, మోహన్‌రావు పాల్గొన్నారు.

గోదావరి జలాల నిలిపివేత



71డీబీఎంకు నిలిచిపోయిన నీరు

అర్వపల్లి: యాసంగి సీజన్‌కుగాను జిల్లాకు వస్తున్న గోదావరి జలాలు వారబందీ విధానంలో ఆదివారం నిలిపివేశారు. ఈ విధానంలో ఈనెల 1న జిల్లాకు గోదావరి జలాలను పునరుద్ధరించారు. వారం రోజులు పూర్తి కావడంతో నిలిపివేశారు. తిరిగి ఈనెల 15న మళ్లీ పునరుద్ధరించి ఈ నెల 22 వరకు వదలనున్నారు.

మట్టపల్లిలో విశేష పూజలు




కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు ఆదివారం విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో విశేష పూజలు చేశారు. సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవారాట్‌కు పంచామృతాభిషేకం జరిపించారు. శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం నిర్వహించారు. కల్యాణతంతులో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహ వచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగల్యధారణ గావించారు. అనంతరంశ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల క్షేత్ర సందర్శన

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఆదివారం గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి కేవీకేను సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త బి.సౌమ్య కేవీకేలో సాగు చేస్తున్న వివిధ రకాల పంటల గురించి వివరించారు. అదేవిధంగా వర్మి కంపోస్టు, జీవన ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి, వైస్ ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు రవికృష్ణ, రజినీ, శైలజ, రాజ్యలక్ష్మి, భగీరథ, మంజుల, అనూష, కోటయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



గడ్డిపల్లి కేవీకేను సందర్శించిన గురుకుల పాఠశాల విద్యార్థులు

పకడ్బందీగా ఇంటర్ ప్రాక్టికల్స్

- డీఐఈఓ భానునాయక్

సూర్యాపేటటౌన్: ఈ నెల 3వ తేదీ నుంచి జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి భానునాయక్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పలు కళాశాలల్లో నిర్వహించిన ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం జరిగిన పరీక్షలో 620 మంది విద్యార్థులకు గాను 594 మంది విద్యార్థులు హాజరు కాగా 26 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఒకేషనల్ విభాగంలో 272 మంది విద్యార్థులకు 229 మంది విద్యార్థులు హాజరు కాగా 43 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో జనరల్ విభాగంలో 394 మంది విద్యార్థులకు గాను 383 మంది విద్యార్థులు హాజరవ్వగా 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చెప్పారు. ఒకేషనల్ విభాగంలో 289 మంది విద్యార్థులకు 263 మంది విద్యార్థులు హాజరు కాగా 26 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు పేర్కొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈఓ భానునాయక్

ప్రైవేట్ ఉపాధ్యాయులకు 12నెలల జీతం ఇవ్వాలి

సూర్యాపేటటౌన్: రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు యాజమాన్యాలు 12నెలల జీతాన్ని ఇవ్వాలని తెలంగాణ ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బస్కూరి కేపీ కుమార్ డిమాండ్ చేశారు. టీపీయూఎస్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రతతో పాటు ప్రభుత్వం హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. ప్రైవేట్ టీచర్లపై వివిధ పాఠశాలల్లో జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కళింగం, ఉపేందర్, బచ్చలకూరి జానయ్య, మహేష్, రాజశేఖర్, ఆర్.రమేష్, సోమరాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ హత్య కేసులో నిందితులను శిక్షించాలి

సూర్యాపేట: ఇటీవల సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన వడ్లకొండ కృష్ణ (బంటి) హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ భద్రయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో కుల, మతాంతర ప్రేమ వివాహాల్లో పరువు హత్యను నివారించడం ఎలా అనే అంశంపై ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణ కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సాయం అందించాలన్నారు. కృష్ణ భార్య భార్గవికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. బహుజన మహాసభ రాష్ట్ర నాయకుడు నారబోయిన వెంకట్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందాడి డేవిడ్‌కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు, సీపీఐ సీనియర్ నాయకులు దంతాల రాంబాబు, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య, సామాజిక అధ్యయన వేదిక కో కన్వీనర్ రేపాక లింగయ్య, సీయూసీ నాయకులు షేక్ కరీం, డీటీఎఫ్ నాయకులు ఎస్‌కె ఉమర్‌టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. వీరన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలబోయిన కిరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారబోయిన వెంకట్

నామినేషన్లకు నేడు ఆఖరు

- భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ వేయనున్న పలువురు అభ్యర్థులు

నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు సోమవారం ముగియనుంది. 3వ తేదీ నుంచి నామినేషన్లు ప్రారంభం కాగా.. 7వ తేదీ వరకు మొత్తం 17 మంది అభ్యర్థులు 23 సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించిన విషయం తెలిసిందే. ప్రస్తుత ఎమ్మెల్సీ, యూటీఎఫ్, ఇతర సంఘాలు అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి ఈ నెల 7వ తేదీన నల్లగొండలో భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ సమర్పించారు. మిగతా వారు కూడా ఒక్కో సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. మరి కొందరు సోమవారం భారీ ర్యాలీతో నామినేషన్లు సమర్పించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

భారీగా దాఖలు కానున్న నామినేషన్లు
సోమవారం నామినేషన్లు ఆఖరు తేదీ కావడంతో అభ్యర్థులు పెద్దసంఖ్యలో నామినేషన్లు దాఖలు చేయనున్నారు. పీఆర్‌టీయూ బలపర్చిన అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి సరోత్తంరెడ్డి భారీ ర్యాలీ నిర్వహించి రెండో సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి, టీజేఏసీ అభ్యర్థిగా హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ కూడా ర్యాలీలు నిర్వహించి నామినేషన్‌ను సమర్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

• నయనానందకరం.. ఎదుర్కోలు మహోత్సవం



యాదగిరిగుట్ట పూర్వగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన ఎదుర్కోలు మహోత్సవంలో పాల్గొన్న ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు

పచ్చదనానికి ప్రణాళిక

- వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం చేస్తున్న అధికారులు
- 475 గ్రామాల్లో నర్సరీల ఏర్పాటు
- ఈ ఏడాది 49 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం



కొండాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీ

చిలుకూరు: ఈ ఏడాది జూన్‌లో నిర్వహించే వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రతి గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు పెంచే కార్యాచరణ సిద్ధం చేశారు. గ్రామాల్లో కార్యదర్శులు, ఉపాధిహామీ టీఏలు, కూలీలకు మొక్కలు పెంచడం పై ఇప్పటికే జిల్లా స్థాయి అధికారులు శిక్షణ పూర్తి చేశారు. మట్టిని, ఎరువుల మిశ్రమంతో ఉపాధిహామీ కూలీలు మొక్కల సంచులు మట్టితో నింపి విత్తనాలు నాటారు. నిత్యం ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఓలు, టీఏలు, ఈసీలు గ్రామ నర్సరీలను సందర్శించి నిర్వాహకులకు తగిన సూచనలు చేస్తున్నారు.

ఒక్కో మొక్కకు రూ.8నుంచి రూ.10 వరకు ఖర్చు
జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మొక్కల పెంపకం చేపడుతున్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక నర్సరీ చొప్పున మొత్తం జిల్లాలోని 475 గ్రామ పంచాయతీలకు గాను 475 జీపీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. ప్రతి పంచాయతీకి కనీసం 10 వేల చొప్పున 49 లక్షల మొక్కలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా.. వీటిల్లో ఇప్పటికే 50 లక్షల బ్యాగ్‌ల్లో విత్తనాలు నాటారు. ఈ ఏడాది టార్గెట్ పూర్తి చేసేందుకు నర్సరీల్లో మొక్కలు పెంచే క్రమంలో వివిధ కారణాలతో మొక్కల ఎండిపోవడం, చనిపోవడం లాంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉండడంతో లక్ష్యానికి మించి మొక్కలను పెంచాలని అధికారులు భావిస్తున్నారు. ఈమేరకు ఒక్కో మొక్కకు కనీసం రూ. 8నుంచి రూ.10 వరకు ఖర్చు చేయనున్నారు. ప్రతి ఇంటికి తులసి మొక్క పంపిణీ చేయనున్నారు. ఇళ్ల రహదారి ప్రాంతాల్లో నీడనిచ్చే, పూల, పండ్ల మొక్కలు నాటనున్నారు. అదేవిధంగా టేకు, ఈత, వెదురు, మలబారు, మునగ, వెలగ, మర్రి, వేప, బాదం, జామ, సీతాఫలం, ఖర్జూరా, మందార, సన్నజాజి, మల్లె తదితర మొక్కలకు ప్రాధాన్యమిస్తున్నారు.

మెళకువలు పాటిస్తూ..
నర్సరీల్లో మొక్కలు పెంచే క్రమంలో సరైన అవగాహన లేక చాలా చోట్ల మొలకలు రాక రెండో సారి విత్తనాలు నాటాల్సి వస్తుంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ దఫా అలా జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విత్తన శుద్ధి చేయడం, సంచుల్లో నాణ్యమైన మట్టి నింపడం, మొలకల రావడానికి అవసరమైన ఉష్ణోగ్రత కల్పించడం, వేసవిలో ఎండిపోకుండా తరుచూ నీటి తడులు ఇవ్వడం, గ్రీన్ నెట్‌లను ఏర్పాటు చేయడం లాంటి చర్యలు తీసుకుంటున్నారు. జాగ్రత్తలపై జిల్లా అధికారులు ఎప్పటికప్పుడూ సూచనలు చేస్తున్నారు.

50 లక్షల బ్యాగుల్లో విత్తనాలు నాటాం



ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 475 గ్రామ నర్సరీల్లో 55 లక్షలు మొక్కలు పెంచడమే లక్ష్యంగా నర్సరీలు సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే 50 లక్షల మట్టి బ్యాగుల్లో విత్తనాలు నాటాం. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది, కార్యదర్శులకు శిక్షణ, సలహాలు ఇస్తూ నర్సరీలు సిద్ధం చేస్తున్నాం. కనీసం ఒక గ్రామ నర్సరీకి 10 నుంచి 12వేల మొక్కలు పెంచాలని నిర్ణయించాం.
– అప్పారావు, డీఆర్‌డీఓ, సూర్యాపేట

క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలు మృతి


అబ్బాస్‌బీ (ఫైల్)

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలంలోని రాఘవాపురంలో శతాధిక వృద్ధురాలు అబ్బాస్‌బీ ఆదివారం ఉదయం మృతిచెందారు. ఆమె వయస్సు 106 సంవత్సరాల వరకు ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె తన భర్త లాల్ మహ్మద్‌తో కలిసి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. సీపీఐ నాయకులు అబ్బాస్‌బీ భౌతికకాయానికి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిపై కేసు

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామంలో బెల్ట్‌షాప్ నిర్వహిస్తూ అక్రమంగా మద్యం అమ్ముతున్న తోర్పునూరి లింగయ్యను ఆదివారం చౌటుప్పల్ పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నకిరేకల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఏపీలోని ఏలూరు జిల్లా కైకలూరుకు చెందిన అబ్దుల్ రావూఫ్(43) నల్లగొండలో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో పని నిమిత్తం బైక్ మీద నల్లగొండ నుంచి నకిరేకల్‌కు వెళ్తుండగా.. మార్గమధ్యలో నకిరేకల్ మండలం తాటికల్ గ్రామ శివారులో బైక్‌ను ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రావూఫ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కూమారులు ఉన్నారు. మృతుడి భార్య తహర్నీసా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విజయావాడలోనే పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని కటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

తుంగతుర్తి: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం తుంగతుర్తి మండలం రావులపల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రావులపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు చింతకుంట్ల యాకయ్య(45) తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా.. ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతి చెందాడు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

హుజూర్‌నగర్: ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హుజూర్‌నగర్ పట్టణంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని తిలక్‌నగర్ కాలనీకి చెందిన లింగం శ్రీను(48) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఆయన కొత్త ఇల్లు నిర్మించుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆయన ఆదివారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య సైదమ్మ, కుమారుడు రవి, కుమార్తె త్రివేణి ఉన్నారు. కుమారుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిన్న కారణానికే ఎంత దారుణం

- ఇంటికి కాస్త ఆలస్యంగా వచ్చాడని మద్యం మత్తులో విచక్షణారహితంగా కుమారుడిని కొట్టిన తండ్రి
- బలమైన దెబ్బ తగలడంతో మృతిచెందిన బాలుడు
- సొంతూరులో గుట్టుగా అంత్యక్రియలు చేసేందుకు ఏర్పాట్లు
- విషయం తెలుసుకుని అడ్డుకున్న పోలీసులు
- పోస్టుమార్టం అనంతరం తిరిగి అంత్యక్రియలు చేసిన కుటుంబ సభ్యులు

చౌటుప్పల్, చౌటుప్పల్ రూరల్: పాఠశాల నుంచి ఆలస్యంగా ఇంటికి వచ్చాడని కొడుకును మద్యం మత్తులో ఉన్న తండ్రి కొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో చోటుచేసుకోగా.. ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన కట్ట సైదులు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. స్వగ్రామంలో వ్యవసాయం కూడా చూసుకుంటున్నాడు. కొంత కాలంగా కుటుంబంతో కలిసి చౌటుప్పల్ పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. సైదులుకు ముగ్గురు కూమారులు ఉన్నారు. పెద్ద కూమారుడు చదువు ఆపి వేసి హయత్‌నగర్‌లో కారు మెకానిక్ నేర్చుకుంటున్నాడు. రెండో


భానుప్రసాద్ (ఫైల్)

కుమారుడు చౌటుప్పల్‌లోనే ఇంటర్ చదువుతున్నాడు. మూడో కుమారుడు భానుప్రసాద్ చౌటుప్పల్‌లోని అన్నా మెమోరియల్ ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాలలో జరిగిన ఫేర్‌వెల్ పార్టీలో పాల్గొన్న భానుప్రసాద్ రాత్రి ఇంటికి కాస్త ఆలస్యంగా వెళ్లాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న సైదులు కుమారుడు ఇంటికి ఆలస్యంగా రావడంతో కోపంతో అతడిని చితకబాదాడు. తండ్రి కొట్టిన దెబ్బలకు తాళలేక భానుప్రసాద్ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అరగంట తర్వాత తండ్రి కోపం తగ్గిందని భావించి భానుప్రసాద్ ఇంటికి రాగా.. మరోసారి విచక్షణారహితంగా కొట్టాడు. ఛాతీపై తన్నడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు పరీక్షించి బాలుడు చనిపోయాడని నిర్ధారించారు. దీంతో శనివారం రాత్రి హుటాహుటిన స్వగ్రామం ఆరెగూడేనికి మృతదేహాన్ని తీసుకెళ్లారు. ఈ విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త తీసుకున్నారు. ఆదివారం ఉదయం దహనసంస్కారాలు చేస్తుండగా.. అప్పటికే సమాచారం అందుకున్న పోలీసులు ఆరెగూడెం గ్రామానికి చేరుకున్నారు. చితిపై ఉంచిన మృతదేహాన్ని కిందకు దింపారు. పోస్టుమార్టం చేసిన తర్వాతే దహన సంస్కారాలు చేయాలని చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ మన్మథకుమార్ మృతుడి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. గ్రామ పెద్దలు వారికి నచ్చజెప్పడంతో మృతదేహానికి పోస్టుమార్టం చేసేలా ఒప్పించారు. పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అశ్రునయనాలతో అంత్యక్రియలు

పోస్టుమార్టం అనంతరం స్వగ్రామం ఆరెగూడెం గ్రామంలో భానుప్రసాద్ మృతదేహానికి అశ్రునయనాల మధ్య కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. చేతికి అందివచ్చిన కొడుకును క్షణికావేశంలో మద్యం మత్తులో ఉన్న తండ్రి కొట్టడంతో చనిపోయాడని తెలుసుకున్న గ్రామ ప్రజలు మృతుడి ఇంటికి బారులుదీరారు. మృతదేహాన్ని చూసి కంటతడి పెట్టుకున్నారు. మృతుడి తల్లి రోదనలు మిన్నంటాయి.

కేసు నమోదు

ఈ ఘటనపై మృతుడి తల్లి కట్ట నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు. చౌటుప్పల్ పట్టణంలో సైదులు నివాసం ఉండే ప్రాంతంలో పోలీసులు విచారణ చేపట్టారు. అక్కడి వ్యక్తుల నుంచి వివరాలు తెలుసుకుని నమోదు చేశారు.

అశ్వవాహనంపై ఎదుర్కోలు ఉత్సవానికి..


సింహవాహన సేవను ఊరేగిస్తున్న అర్చకులు


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న అధికారులు, అర్చకులు

- పూర్వగిరిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- నేడు తిరు కల్యాణోత్సవం

యాదగిరిగుట్ట: పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం మూడో రోజుకు చేరాయి. ఆదివారం ఉదయం యాగశాలలో ఆరాధన, నిత్య పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. నిత్యారాధన అనంతరం పారాయణీకులచే వేద పారాయణములు, మూలమంత్ర, మూర్తి మంత్ర అనుష్టానములు, హవనములు గావించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల అలంకార సేవలకు శ్రీకారం చుట్టారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి సింహ వాహనంపై అధిష్టింపజేసి ఊరేగించారు. సాయంత్రం నిత్యారాధనల అనంతరం పారాయణీకులచే పారాయణం, హవనం నిర్వహించారు. అనంతరం స్వామివారిని అలంకరించి అశ్వవాహనంపై, ప్రత్యేక పల్లకీపై అమ్మవారిని ఊరేగించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించి కల్యాణానికి ముహూర్తం నిర్ణయించారు. స్వామి, అమ్మవారి పక్షాన అధికారులు, అర్చకులు వేర్వేరుగా నిలిచి, వివాహ నిశ్చయ తాంబూలాలు ఇచ్చి పుచ్చుకున్నారు. ఆయా వేడుకల్లో ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఆలయ ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, అర్చక బృందం, పారాయణీకులు, ఆలయ అధికారులు, పర్యవేక్షకులు, ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కల్యాణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తిరు కల్యాణ వేడుకలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 8గంటలకు హవనం, తిరుమంజనోత్సవం, హనుమంత సేవ నిర్వహిస్తారు. రాత్రి 8గంటలకు గజవాహనం చేపట్టి స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

ఎదుర్కోలు ఉత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ సన్నిధిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. యాదగిరిగుట్టలోని గుండ్లపల్లికి చెందిన వీర ప్రతాప భజన మండలి, భాగ్యలక్ష్మి భజన మండలి ఆధ్వర్యంలో భజన నిర్వహించారు. హైదరాబాద్‌లోని డీఎస్ శ్రీదేవి భక్తి సంగీతం, సాయి స్నేహ నృత్యాలయం హైదరాబాద్‌చే కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు.

గురుకుల పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

- విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రిన్సిపాల్‌తో వాగ్వాదం


జనంపల్లి గురుకుల పాఠశాల గేటు వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

రామన్నపేట: రామన్నపేట మండలం జనంపల్లిలోని వేమవరం సత్తెమ్మ-వెంకటరత్నం పంతులు గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలు, ప్రిన్సిపాల్ వైఖరిని నిరసిస్తూ ఆదివారం విద్యార్థుల తల్లితండ్రులు పాఠశాల వద్ద ఆందోళన నిర్వహించారు. గురుకుల సొసైటీ నిబంధనల ప్రకారం ప్రతి నెల రెండో ఆదివారం తల్లిదండ్రులకు తమ పిల్లలను కలిసే అవకాశం కల్పిస్తారు. ఆదివారం కూడా వివిధ ప్రాంతాల నుంచి తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో తమ పిల్లలను కలిసేందుకు పాఠశాలకు వచ్చారు. పాఠశాలలోని సమస్యలు, నిర్వహణ, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను తెలిపేందుకు కొందరు తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ రాజాను కలిశారు. ఈ క్రమంలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గురించి ప్రిన్సిపాల్ చర్చిస్తున్న సమయంలో వాగ్వాదం మొదలైంది. నీటి కొరత వల్ల రాత్రి పొద్దుపోయాక పిల్లలు స్నానాలు చేయాల్సి వస్తుందని, కోతులు దాడిచేసి గాయపరుస్తున్నా పట్టించుకోవడం లేదని, నెలనెలా తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. పిల్లలు అనారోగ్యంపాలైతే పరిస్థితి విషమించే వరకు సమాచారం ఇవ్వడం లేదని, డార్మిటరీలు లేక తరగతి గదుల్లోనే పిల్లలు బిక్కుబిక్కుమంటూ పడుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు ఫోన్‌చేస్తే ప్రిన్సిపాల్, సిబ్బంది స్పందించరని ఆరోపించారు. అనంతరం పాఠశాల ప్రధాన ద్వారం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎల్లప్పుడూ పాఠశాలలో అందుబాటులో ఉంటూ నిరంతరం పర్యవేక్షించాలని, నెలనెలా పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేయాలని, పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రంను ప్రిన్సిపాల్‌కు అందజేశారు.

ప్రిన్సిపాల్ వివరణ..

పాఠశాలలో 320 మంది విద్యార్థులకు సరిపడే వసతులు మాత్రమే ఉన్నాయనీ, ప్రస్తుతం పాఠశాలలో 585 మంది విద్యార్థులు ఉన్నారని ప్రిన్సిపాల్ ఎ. రాజా తెలిపారు. గత జూలైలో తనకు తుంగతుర్తి గురుకుల పాఠశాలకు సంబంధించి అదనపు బాధ్యతలు అప్పగించారని, జనవరి 20న తిరిగి ఈ పాఠశాల బాధ్యతలను స్వీకరించానని చెప్పారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఉదయం నాలుగు గంటలకే స్టడీ అవర్స్ మొదలై రాత్రి పది గంటల వరకు ఉంటుందని, కొందరు విద్యార్థులు రాత్రి స్నానం చేసి నిద్రిస్తారని వివరించారు. విద్యార్థుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని, సమస్యలను ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

గేదెను ఢీకొని వ్యక్తి మృతి


కృష్ణ (ఫైల్)

కొండమల్లేపల్లి: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి గేదెను ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల గుమ్మడవెల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. గుర్రంపోడు మండలం మునీమ్ కానిగూడెం గ్రామానికి చెందిన చింతల కృష్ణ(29) తన అత్తగారి ఊరు చందంపేట మండలం ముదుదండ్ల గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి బైక్‌పై పయనమయ్యాడు. మార్గమధ్యలో కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామ సమీపంలో ఒక్కసారిగా గేదె అడ్డు రావడంతో దానిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కృష్ణ తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు 108 వాహనంలో దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య సైదమ్మ, మూడు నెలల పాప ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

చెర్వుగట్టులో ముగిసిన బ్రహ్మోత్సవాలు

నార్కట్‌పల్లి: చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు ఏకాదశ రుద్రాభిషేకం, మహానివేదన, నీరాజన మంత్ర పుష్ప పూజలను నిర్వహించారు. సాయంత్రం గజవాహనంపై స్వామి, అమ్మవార్ల ఉంచి.. చెర్వుగట్టు, ఎల్లారెడ్డిగూడెం గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నవీన్‌కుమార్, సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, నేతగాని కృష్ణ, వారాల రమేష్, రేగట్టె నవీన్‌రెడ్డి, గడుసు శేఖర్‌రెడ్డి, రేగట్టె నర్సిరెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, రాజ్యలక్ష్మి, వంశీధర్‌రావు, నరేష్, గణేష్, మహేందర్‌రెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.


స్వామి, అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

చెరువులో దూకిన వ్యక్తి మృతదేహం లభ్యం


మృతదేహాన్ని వెలికితీస్తున్న పోలీసులు

బీబీనగర్: బీబీనగర్ మండల కేంద్రంలో గల పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మృతదేహం నాలుగు రోజుల తర్వాత ఆదివారం ఉదయం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఫిర్జాదిగూడకు చెందిన చంద్రయ్య(60) ఈ నెల 5వ తేదీ ఉదయం ఆస్పత్రి వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులతో చెప్పి ఇంటి నుంచి బయల్దేరి బీబీనగర్‌కు చేరుకున్నాడు. తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా బీబీనగర్ పెద్ద చెరువు కట్టపై ఓ వ్యక్తి బట్టలు, చెప్పులు, బ్యాగు గమనించిన స్థానికులు ఈ నెల 7న స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే చంద్రయ్య తప్పిపోయినట్లు ఫిర్యాదు ఉండడంతో అనుమానంతో పోలీసులు కుటుంబ సభ్యులను పిలిపించి కట్టపై వదిలివున్న బట్టలు, చెప్పులు చూపించగా అవి చంద్రయ్యవే అని నిర్ధారించారు. చంద్రయ్య చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావించి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం తెల్లవారుజామున చంద్రయ్య మృతదేహం చెరువులో లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

కీచక ఉపాధ్యాయుడు

- మహిళతో సహజీవనం చేస్తూ ఆమె కుమార్తెలపై అత్యాచారం చేసిన ప్రభుత్వ టీచర్
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సదరు మహిళ
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

సూర్యాపేటటౌన్: విద్యాబుద్ధులు నేర్పించే ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఓ మహిళతో సహజీవనం చేస్తూ ఆమె కుమార్తెలపై అత్యాచారం ఒడిగట్టాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని చర్చి కాంపౌండ్‌లో నివాసముండే ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాటోతు సునీల్‌కుమార్ జిల్లా కేంద్రంలోని మామిళ్లగడ్డ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా అతడు భార్యకు దూరంగా ఉంటూ మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. 2018 నుంచి ఆ మహిళతోనే ఉంటూ సహజీవనం చేస్తున్నాడు. సదరు మహిళకు భర్త లేడు. ఇద్దరు కుమార్తెలు ఉండడంతో వారిని చదివించుకుంటూ సునీల్ కుమార్‌తోనే ఉంటోంది.

తల్లితో సహజీవనం చేస్తూ.. ఇద్దరు కుమార్తెలపై అత్యాచారం..

జాటోతు సునీల్‌కుమార్ కన్ను ఆ మహిళ కుమార్తెలపై పడింది. వారిని ఎలాగైనా లొంగతీసుకోవాలనే కోరికతో కొద్దిరోజులుగా ముగ్గురికి నిద్ర మాత్రలు ఇస్తూ సదరు మహిళ ఇద్దరు కుమార్తెలపై అత్యాచారం చేశాడు. తల్లితో చెబితే చంపేస్తానని బెదిరింపులకు సైతం పాల్పడ్డాడు. ఓ రోజు సదరు మహిళ చూస్తుండగానే ఆమె కుమార్తెపై సునీల్‌కుమార్ అత్యాచారం చేస్తుండగా వెంటనే కేకలు వేసి అతడి చెర నుంచి విడిపించింది.

పోక్సో కేసు నమోదు...

సదరు మహిళ సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 5వ తేదీన సునీల్‌కుమార్‌పై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సునీల్‌కుమార్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీర రాఘవులు తెలిపారు. సునీల్‌కుమార్ తనను తనను పెళ్లి కూడా చేసుకున్నాడని సదరు మహిళ ఫిర్యాదులో పేర్కొంది.

ఉపాధ్యాయుడికి హెచ్ఐవీ..?

సునీల్‌కుమార్‌కు హెచ్ఐవీతో పాటు పలు సుఖ వ్యాధులు ఉన్నట్లు సదరు మహిళ ఫిర్యాదులో పేర్కొంది. తమకు న్యాయం చేసి ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. సునీల్‌కుమార్‌ను అరెస్ట్ చేసి హెచ్ఐవీ టెస్ట్ చేయిస్తామని పట్టణ సీఐ తెలిపారు. అదేవిధంగా సదరు మహిళకు, ఆమె కుమార్తెలకు కూడా సోమవారం హెచ్ఐవీ పరీక్షలు చేయించనున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్‌సీ ప్రకటించాలి

- డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. సోమయ్య



మాట్లాడుతున్న సోమయ్య

సూర్యాపేటటౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్‌సీ ప్రకటించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఎం. సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన మద్దిరాల ఎంఈఓ, మద్దిరాల జెడ్పీహెచ్ఎస్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు తండు వెంకటనారాయణ ఉద్యోగ విరమణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని, విద్యా రంగంలో పేరుకుపోతున్న అనేక సమస్యలకు పరిష్కారం దొరకడం లేదని అన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించడంలో ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని విమర్శించారు. పబ్బతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు జెల్లా ప్రసాద్, వనమాల వెంకటేశ్వర్లు, సీహెచ్. వెంకటేశ్వర్లు, వేణు, ఆర్. లింగయ్య, బి. వెంకటేశ్వరరావు, సింహాద్రి, క్రాంతికుమార్, ఆనంద భాస్కర్, యాదగిరి, వెంకటయ్య చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రాములు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో దుండగుల చోరీ

- 14 తులాల బంగారం, 40 తులాల వెండి వస్తువులు అపహరణ


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

మోతె: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మోతె మండలం గోల్‌తండాలో జరిగిన ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్‌తండాకు చెందిన ధరావత్ వెంకన్న, ఉష దంపతులు శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి తమ వ్యవసాయ బావి వద్ద మిర్చి తోటలో పనికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా.. తాళం తీసి ఉండటం గమనించారు. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో పాటు బీరువాలోని ట్రంక్ పెట్టెలో దాచిన 14 తులాల బంగారం, 40 తులాల వెండి వస్తువులు కనిపించలేదు. ఆదివారం ఉష ఇచ్చిన ఫిర్యాదు మేరకు మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, మోతె ఎస్ఐ యాదవేందర్ రెడ్డి తమ సిబ్బందితో చోరీ జరిగిన ఇంటికి చేరుకుని వివరాలు సేకరించారు. సీసీ కెమెరాలను పరిశీలించడంతో పాటు క్లూస్‌టీం పిలిపించి ఆధారాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పెద్దఅడిశర్లపల్లి: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన గుడిపల్లి మండలంలో చోటుచేసుకుంది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిపల్లి మండల కేంద్రానికి చెందిన షోషంరెడ్డి నారాయణరెడ్డి(60) ఆదివారం సాయంత్రం తన వ్యవసాయ పొలంలో నాటుకోళ్లను కమ్మడానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. భార్య ఫోన్ చేసినా స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా బావిలో పడి ఉన్నాడు. స్థానికుల సహాయంతో నారాయణరెడ్డిని బావిలోంచి తీసి చూసేసరికి మెడపై బలమైన గాయం ఉండి మృతిచెంది ఉన్నాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ నర్సింహులు తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి మెడపై బలమైన గాయం ఉండటంతో హత్య గావించపడ్డాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

25 లక్షల నగదు అపహరణ


బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు


సీసీ కెమెరాలో రికార్డయిన నిందితుడి దృశ్యాలు

- ప్రైవేట్ బస్సులో బ్యాగు పెట్టి హోటల్‌లో టిఫిన్ చేసేందుకు వెళ్లిన ప్రయాణికుడు
- బ్యాగులోని నగదు ఎత్తుకెళ్లిన దుండగుడు

నార్కట్‌పల్లి: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుడు హోటల్ వద్ద బస్సు దిగి టిఫిన్ చేసి వచ్చేలోపు అతడి బ్యాగును గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించాడు. ఈ ఘటన విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై నార్కట్‌పల్లి మండలం గోపలాయిపల్లి గ్రామ శివారులో గల పూజిత హోటల్ వద్ద ఆదివారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని బాపట్లకు చెందిన వెంకటేశ్వర్లు చెన్నైలో శనివారం రాత్రి 11 గంటలకు చామ ప్రైవేట్ ట్రావెల్ బస్సులో ఎక్కి హైదరాబాద్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు నార్కట్‌పల్లి శివారులో విజయవాడ-హైదరాబాద్ హైవేపై గల పూజిత హోటల్ వద్ద టిఫిన్ చేయడానికి బస్సును డ్రైవర్ ఆపాడు. ఈ సమయంలో వెంకటేశ్వర్లు రూ.25లక్షలు గల తన బ్యాగును బస్సులోని తన సీట్లో పెట్టి హోటల్‌లో టిఫిన్ చేసేందుకు వెళ్లాడు. టిఫిన్ చేసిన తర్వాత బస్సులోకి వచ్చి చూడగా బ్యాగు కనిపించలేదు. దీంతో నార్కట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ నాగరాజు, నార్కట్‌పల్లి ఎస్ఐ క్రాంతికుమార్, చిట్యాల ఎస్ఐ ధర్మా హోటల్ వద్దకు చేరుకుని సీసీ కెమెరాలను పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తి బస్సు ఆగిన తర్వాత రోడ్డు పైనుంచి వచ్చి బస్సులోకి ఎక్కి వెంకటేశ్వర్లుకు చెందిన బ్యాగును మాత్రమే తీసుకొని వెళ్లిపోయినట్లు గుర్తించారు. రూ.25లక్షలు గల బ్యాగును బస్సులోనే వదిలేసి అంత నిర్లక్ష్యంగా టిఫిన్ చేయడానికి ఎలా వెళ్లాడని బాధితుడిపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌గా మారిన హోటల్..

పూజిత హోటల్ వద్ద ఆర్టీసీ, ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు భోజనానికి, టిఫిన్ చేసేందుకు బస్సులను ఎక్కువగా ఆపుతారు. నార్కట్‌పల్లి ఫ్లైఓవర్ మీదుగా వచ్చే బస్సులు నార్కట్‌పల్లి పట్టణంలోకి వెళ్లకుండా ఈ హోటల్ వద్దే ఆపుతుండడంతో బస్టాండ్ తలపిస్తోంది. గుర్తుతెలియని వ్యక్తులు కూడా ఇదే అదునుగా భావించి బస్సుల్లో నుంచి బ్యాగులు చోరీ చేసి హైవే పైకి వెళ్లి ప్రైవేట్ వాహనాల్లో వెళ్లిపోతుండడంతో వారిని పట్టుకోవడం పోలీసులకు సవాల్ మారింది.

గతంలో జరిగిన ఘటనలు

- పూజిత హోటల్ వద్ద గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగాయి. 2022 నవంబర్ 22న చెన్నై నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సును హోటల్ వద్ద ఆపగా.. ఓ ప్రయాణికుడికి చెందిన 130 తులాల బంగారం చోరీ జరిగింది.
- 2019 జూలై 4న నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా.. డ్రైవర్ ఈ హోటల్ వద్ద అల్పాహారం కోసం ఆపాడు. ప్రయాణికులు దిగిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు బస్సులోకి వెళ్లి రూ.10 లక్షల నగదు బ్యాగును చోరీ చేశారు.
- 2023 జూలై 27న ప్రైవేట్ ట్రావెల్ బస్సులో రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని కృష్ణా కాలనీ చెందిన వ్యాపారి సుశాంత్‌కుమార్ పాండా ఒరిస్సా రాష్ట్రం నుంచి రూ.28 లక్షలతో హైదరాబాద్‌కు వస్తుండగా... బస్సు డ్రైవర్ పూజిత హోటల్ వద్ద అల్పాహారం కోసం ఆపాడు. టిఫిన్ కోసం పాండా కిందకు దిగగా.. తన సీట్లో ఉంచిన డబ్బులు ఉన్న రెండు బ్యాగులను దుండగులు ఎత్తుకెళ్లారు.

నిందితుడిని పట్టుకుంటాం



పూజిత హోటల్ వద్ద బస్సులో నగదు బ్యాగు ఎత్తుకెళ్లిన దొంగను పట్టుకునేందుకు ప్రత్యేక టీం ఏర్పాటు చేస్తున్నాం. త్వరలో నిందితుడిని పట్టుకుంటాం – ఎస్ఐ క్రాంతికుమార్